అక్రమ నిర్మాణాల జోరు

- జోన్-3లో విచ్చలవిడిగా అనధికార కట్టడాలు
- 'కూటమి' ఎమ్మెల్యేల చేత సిఫార్సులు
- కన్నెత్తి చూడని టౌన్ ప్లానింగ్ అధికారులు


బీవీకే కళాశాల వద్ద గెడ్డ స్థలం ఆక్రమించి కంటైనర్‌లో నిర్వహిస్తున్న వ్యాపారం



శాంతిపురం, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో అనధికార నిర్మాణాలు

సీతంపేట: జీవీఎంసీ జోన్-3 పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. కూటమి నాయకుల సిఫార్సులతో అనధికారిక నిర్మాణాలకు అడ్డుకట్ట వేయడంలో టౌన్ ప్లానింగ్ అధికారులు వెనుకాడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక టౌన్ ప్లానింగ్ విభాగం అలసత్వం వహించిందని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధాన రహదారుల్లో సైతం అనుమతి లేకుండా అక్రమంగా అదనపు అంతస్తులు నిర్మిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఫలితంగా టీడీఆర్ రూపంలో జీవీఎంసీకి రావాల్సిన లక్షలాది రూపాయల ఆదాయానికి పరోక్షంగా గండి కొడుతున్నారు.

25వ వార్డులో పెద్ద ఎత్తున..

జీవీఎంసీ 25వ వార్డులో పెద్ద ఎత్తున అనధికార నిర్మాణాలు కొనసాగుతున్నా.. అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజేంద్రనగర్‌లోని వార్డు కార్యాలయం ఎదురుగా జీ ప్లస్ 2కు అనుమతి తీసుకుని మరో అంతస్తు అదనంగా నిర్మించారు. దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా.. టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్నారు. భవన యజమాని ఇంటికి సమీపంలో ఉంటున్న వేరే నియోజకవర్గానికి చెందిన ఒక ఎమ్మెల్యే చేత టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులకు సిఫార్సు చేయించారని బహిరంగ ప్రచారం జోరుగా సాగుతోంది. దీంతో అధికారులు ఆ నిర్మాణం వైపు కన్నెత్తి చూడటం లేదు.

లేని రోడ్డు ఉన్నట్టుగా..

శాంతిపురంలోని చిన్న వినాయక గుడి ఎదురుగా రెండు అడుగుల రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా నాలుగంతస్తుల భవనం నిర్మించారు. ఎదురెదురుగా మనిషి వస్తే తప్పుకోడానికి వీలులేని ఇరుకు రహదారిలో ఈ నిర్మాణానికి ఎలా అనుమతి ఇచ్చారో టౌన్ ప్లానింగ్ అధికారులకే తెలియాలి. అక్కడ ఉన్నది రెండడుగుల రోడ్డే అయినప్పటికీ ప్లాన్‌లో 40 అడుగుల రహదారి ఉన్నట్టు చూపించి నిర్మాణాలు చేపడుతున్నారని, ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గెడ్డ స్థలం ఆక్రమణ..

25వ వార్డు పరిధి బీవీకే కళాశాల పక్కన గల గెడ్డ స్థలాన్ని ఒక వ్యక్తి ఆక్రమించి ప్రహరీ నిర్మించి కంటైనర్ జ్యూస్ బార్ ఏర్పాటు చేశాడు. సర్వే నంబర్ 38/2 సీ-1 చెందిన గెడ్డ స్థలంలో సుమారు 70 గజాలు త్రిభుజాకారంలో ఆక్రమించి వ్యాపారానికి వినియోగిస్తున్నాడు. ప్రధాన రహదారిలో విలువైన గెడ్డ స్థలం ఆక్రమించినా అధికారులు కన్నెత్తి చూడలేదు. ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ రెండు రోజుల కిందట కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, తహసీల్దార్‌లకు ఫిర్యాదు చేశారు.

అనుమతులు నిల్..

సీతంపేట మెయిన్ రోడ్డులో జీ ప్లస్ 2 కమర్షియల్ బిల్డింగ్‌పై అనుమతి లేకుండా అదనపు అంతస్తు నిర్మాణం చేపట్టారు. పక్క నియోజకవర్గ ఎమ్మెల్యే అనుచరుడి సిఫార్సుతో చర్యలు చేపట్టడానికి టౌన్ ప్లానింగ్ విభాగం వెనకడుగు వేసింది. దీంతో అక్రమంగా అదనపు అంతస్తు నిర్మాణానికి అడ్డంకి లేకుండా పోయింది.

అక్రమ నిర్మాణాలు పరిశీలిస్తాం

జీవీఎంసీ జోన్-3 పరిధిలోని 25వ వార్డులో చేపడుతున్న అక్రమ నిర్మాణాలు నా దృష్టికి వచ్చాయి. కోర్టు కేసుల వల్ల బిజీగా ఉండి ఫిర్యాదులు చూడలేక పోయాను. ఒకటి రెండు రోజుల్లో అనుమతి లేని నిర్మాణాలన్నింటినీ పరిశీలించి చర్యలు తీసుకుంటాను.

– మధు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ, జోన్-3

మద్యం సిండికేట్‌కు ఎక్సైజ్ శాఖ గులాం..!



- కొన్ని మద్యం దుకాణాలపై పక్షపాత వైఖరి
- వైన్ షాప్ తరలించాలంటూ ఆదేశాలు
- అధికారుల వేధింపులతో వ్యాపారుల ఆందోళన

సీతమ్మధార: మద్యం సిండికేట్‌కు సంబంధం లేని కొన్ని మద్యం దుకాణాలను పదే పదే తరలించాలని ఎక్సైజ్ శాఖ అధికారులు వేధించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. వివరాలిలా.. ప్రభుత్వం లైసెన్స్ ఇవ్వడంతో ఉత్తర నియోజకవర్గంలోని ఓ ప్రాంతంలో ఒక వ్యాపారి గత నెల 18న వైన్ షాపు ఏర్పాటు చేశాడు. ఎక్సైజ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఈ దుకాణాన్ని మరో ప్రాంతానికి తరలించారు. ఇక్కడికి చాలా దూరంలో ఒక బార్ ఉందన్న నెపంతో ఎక్సైజ్ శాఖ మద్యం సిండికేట్ ఒత్తిడికి తలొగ్గి వైన్ షాప్‌ను తరలించేయాలని చెప్పడం తీవ్ర దుమారం రేపుతోంది. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో పక్కపక్కనే రెండేసి బార్లు, మద్యం దుకాణాలు ఉన్నా.. పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు తగుదునమ్మా అంటూ ఉత్తర నియోజకవర్గంలోని ఒక మద్యం దుకాణాన్ని పదే పదే తరలించేయాలని ఆదేశించడం గమనార్హం. ఈ మద్యం దుకాణానికి రెండేళ్ల కాలపరిమితికి లైసెన్స్ ఉంది. రూ.లక్షల్లో అప్పులు చేసి వైన్ షాప్ ఏర్పాటు చేసుకుంటే సిండికేట్‌కు దాసోహమైన ఎక్సైజ్ శాఖ అధికారులు పదేపదే తరలించాలని ఆదేశాలు జారీ చేయడం విమర్శలకు తావిస్తోంది.

సిండికేట్ ఒత్తిడి..

ఉత్తర నియోజకవర్గంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వచ్చేసినా సరే మళ్లీ ఎక్సైజ్ శాఖ అధికారులు ఒత్తిడి చేసి దుకాణం తరలించాలని ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. సిండికేట్ ఒత్తిడి కారణంగానే ఎక్సైజ్ శాఖ అధికారులు వేధిస్తున్నారని కొన్ని మద్యం దుకాణం వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుడి, బడికి వంద మీటర్ల దూరంలో వైన్ షాపులు ఉండరాదన్న నిబంధనలు ఉన్నాయని, సిండికేట్ ఒత్తిడి పుణ్యమా అని ఒక మద్యం దుకాణం సమీపంలో మరొకటి ఉండరాదన్న నిబంధన ఎక్సైజ్ శాఖ అధికారులు కొత్తగా విధించడం విడ్డూరంగా ఉందని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిండికేట్‌కు సంబంధం లేని వ్యారిని ఎక్సైజ్ శాఖ అధికారులు వేధించడం సమంజసం కాదని మద్యం వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరలించిన ప్రాంతంలో కూడా వ్యాపారం చేయనిస్తారా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చివరికి మద్యం వ్యాపారులు ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో ఆయన ఎక్సైజ్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఎక్సైజ్ శాఖ అధికారులు కూడా సానుకూలంగా స్పందించారని సమాచారం. ఈ వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాల్సిందే.

క్లుప్తంగా

వైభవుని ఆలయంలో ముగిసిన పవిత్రోత్సవాలు


పవిత్రాలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉదయం 5 గంటలకు శ్రీవారి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం స్వామిని పవిత్రాలతో అలంకరించి భక్తులకు పవిత్రాలంకృత ప్రభాత దర్శనం కల్పించారు. నిత్య ప్రాభోధిత సేవ, మండపార్చన, కుంభారాధనం, మంగళాశాసనం, తీర్థగోష్టి నిర్వహించారు. ఉదయం 9 గంటలకు శ్రీవారి ఉత్సవ మూర్తులకు స్నపన మహోత్సం, పూర్ణాహుతి, ధ్వజారోహణం, మంగళాశాసనం, తీర్థ గోష్టి, సాయంత్రం 5 గంటలకు భక్తులకు వైభవుడి దర్శనం కల్పించారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

చురుగ్గా కాలువ నిర్మాణం


సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో నిర్మిస్తున్న కాలువ

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో కాలువ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.2 లక్షలతో ఇక్కడ ఇక్కడి మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న ప్రాంతంలో కొత్త కాలువ నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతంలో వర్షాలకు నీరు, మట్టి రోడ్డుపైకి వచ్చేస్తుంది. ఒక్కోసారి వాన నీరు రోడ్డుపైనే రోజుల తరబడి నిలిచిపోతుందని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ కాలువ నిర్మించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జోన్-3 పబ్లిక్ వర్క్స్ విభాగం ఇంజినీర్ల పర్యవేక్షణలో, వార్డు వర్క్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి.

రెండు ఆవుల అదృశ్యంపై ఫిర్యాదు

సీతమ్మధార: రెండు జెర్సీ ఆవుల అదృశ్యంపై ద్వారకా పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితుడు రాము తెలిపిన వివరాలిలా.. సీతమ్మధార దరి ఏఎస్‌ఆర్ నగర్‌లో నివసిస్తున్న ఎ.రాము 8 ఏళ్లుగా రెండు జెర్సీ ఆవులను పెంచుతున్నాడు. ఇంటి ఆవరణలో కట్టి ఉంచిన ఆవులను ఆదివారం ఉదయం నిద్రలేచి చూసేసరికి కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎంతగా గాలించినా ఫలితం లేకపోవడంతో బుధవారం రాము ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శివాలయంలో మహా అన్నదానం


అన్నదానంలో పాల్గొన్న ఆలయ ధర్మకర్త తైనాల విజయ్‌కుమార్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం, రామచంద్రనగర్‌లోని ఉమారామలింగేశ్వరాలయంలో బుధవారం మహా అన్నదానం నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ఆలయ ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ ప్రారంభించారు. సుమారు 4వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కంపా హనోకు, వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పైడిరమణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ జయదేవి

మహారాణిపేట: 'బాల్ వివాహ్ ముక్తి భారత్' కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, పర్యవేక్షణ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు నిర్వహించిన ర్యాలీని జిల్లా మహిళా సంక్షేమ శాఖ పీడీ జి.జయదేవి ప్రారంభించారు. జైలు రోడ్డులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి జగదాంబ సెంటర్ వరకు అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సీడీపీవోలు జి.శారదాదేవి, రమణికుమారి, శ్రీలత, శ్రీదేవి, ఇతర శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.24 లక్షలతో అభివృద్ధి పనులు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, పల్లా శ్రీనివాస్, కార్పొరేటర్ గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు రాజేంద్రనగర్‌లో రూ.24 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన జరిగింది. రాజేంద్రనగర్‌లోని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ క్యాంపు కార్యాలయానికి వెళ్లే మార్గంలో బీటీ, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ మేరకు ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్‌తో కలిసి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు దీపికా అగర్వాల్, పసుపులేటి ఉషా కిరణ్, జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఈఈ గంగాధర్, డీఈ విజయ్‌కుమార్, ఏఈ శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 11 కిలోల గంజాయి స్వాధీనం


రైల్వే పోలీసుల అదుపులో గంజాయి రవాణాదారుడు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. విశాఖ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారాల్లో బుధవారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ రామారావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్(సీఐబీ) హెచ్.డి.శర్మ తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఒడిశా గజపతి జిల్లాకు చెందిన దేబానంద మండల్ నాయక్ రూ.55 వేల విలువైన 11 కేజీల గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని సీజ్ చేసి నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

1న రౌండ్ టేబుల్ సమావేశం

మద్దిలపాలెం: గత రాష్ట్ర ప్రభుత్వం రుషికొండపై నిర్మించిన భవనాల వినియోగం అనే అంశంపై డిసెంబర్ 1న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు సమావేశ కన్వీనర్ ఎస్.పి.రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ పౌర గ్రంథాలయం హాల్‌లో ఉదయం 10 గంటలకు మొదలయ్యే ఈ సమావేశంలో ప్రముఖుల అభిప్రాయ సేకరిస్తామని తెలిపారు. వాటిని ప్రభుత్వ పరిశీలనకు నివేదిస్తామన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ఆచార్య బాలమోహన్‌దాస్, పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ ,బి.వి.అప్పారావు, వి.శారదా, నన్నయ్య యూనివర్సిటీ పూర్వ వీసీ ముత్యాల నాయుడు, కల్నల్ ఎ.కె.సుబ్బారావు, అజశర్మ, జయశ్రీ తదితరులు పాల్గొంటారని చెప్పారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు


ఈశ్వరరావు మృతదేహం

సీతమ్మధార: అనారోగ్యంతో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సీతంపేట జంక్షన్ ప్రాంతానికి చెందిన చింతపల్లి హరిప్రసాద్ 12 ఏళ్లుగా అదే ప్రాంతంలో సాత్విక్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ప్రతి రోజు రాత్రి ఈ సెంటర్‌ను మూసివేసిన తరువాత దాని ముందు డి.ఈశ్వరరావు(35) అనే వ్యక్తి పడుకునేవాడు. ఇలా 12 ఏళ్లుగా ఈశ్వరరావు అక్కడే నిద్రిస్తున్నాడు. అతడు అప్పుడప్పుడు ఆ ఫుడ్ సెంటర్‌లో కేటరింగ్ వ్యాపారంలో కటింగ్ పనులు చేస్తూ ఉండేవాడు. ఇటీవల అతడికి క్షయ వ్యాధి సోకింది. మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. వైద్యులను సంప్రదించగా.. ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గిపోయిందని, డెంగ్యూ సోకిందని చెప్పారు. ఇదిలా ఉండగా ఈ నెల 26వ తేదీ రాత్రి 10.45 గంటలకు ఆ ఫుడ్ సెంటర్ వద్ద పడుకున్నాడు. ఉదయం షాపు యజమాని వచ్చి లేపడానికి ప్రయత్నించగా ఎటువంటి స్పందన లేదు. దీంతో అతడు మరణించినట్లు గ్రహించి వెంటనే ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏఎస్‌ఐ గంగాధర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విశేష అలంకరణలో కాశీ విశ్వేశ్వరుడు


పుష్పాలంకరణలో అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వరుడు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు వరాహగిరికాలనీ-2లోని అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వరాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా కాశీ విశ్వేశ్వరుడిని పుష్పాలతో విశేషంగా అలంకరించారు.

ఆలయ ధర్మకర్త కేదారిశెట్టి ఆదిలక్ష్మి, అర్చకుడు అంబటిపూడి సుధీర్‌కుమార్ శర్మ మాట్లాడుతూ ఆలయంలో గత 121 రోజులుగా ప్రత్యేక పూజలు జరుగుతున్నాయన్నారు. డిసెంబరు 4వ తేదీన మహా అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

పార్కు స్థలంలో అగ్ని ప్రమాదం


రాజేంద్రనగర్ పార్కు స్థలంలో తగలబడుతున్న బడ్డీలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు రాజేంద్రనగర్‌లోని పార్కు స్థలంలో చెత్త తగలబడి మంటలు చెలరేగాయి. పార్కు ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్త బుధవారం ఉదయం 10 గంటల సమయంలో ఒక్కసారిగా తగలబడి, మంటలు చెలరేగాయి. ఆ మంటలు పార్కు స్థలంలో డంప్ చేసిన చెక్క బడ్డీలకు వ్యాపించడంతో పెద్ద ఎత్తున మంటలు రేగాయి. భయాందోళను గురైన స్థానికులు పోలీసులకు పిర్యాదు చేశారు. ద్వారకా పోలీసులు ఫైర్ విభాగానికి సమాచారం అందించడంతో, వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఏళ్ల తరబడి పార్కు స్థలం ఖాళీగా ఉండటంతో చెత్త చెదారం పడవేస్తున్నారని, అలాగే జీవీఎంసీ సిబ్బంది ఎక్కడెక్కడో రోడ్డు పక్కన పెట్టిన బడ్డీలను తొలగించి పార్కు స్థలంలో పడేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఒకప్పుడు ఎంతో ఆహ్లాదాన్నిచ్చిన పార్కు చెత్తా చెదారంతో, బహిరంగ మలమూత్ర విసర్జనతో రోత పుట్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కు అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని కోరుతున్నారు.

ఎట్టకేలకు ఫోర్త్‌టౌన్‌కు క్రైం ఎస్‌ఐ


బాధ్యతలు స్వీకరించిన సత్యారావు

సీతమ్మధార: నాలుగో పట్టణ క్రైం ఎస్‌ఐ పోస్టు ఎట్టకేలకు భర్తీ అయింది. మహారాణిపేట క్రైం ఎస్‌ఐగా చేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చిన సత్యారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ క్రైం ఎస్‌ఐగా పనిచేసిన భాస్కరరావు ఈ ఏడాది సెప్టెంబర్ 19న బదిలీపై పీఎం పాలెం స్టేషన్‌కు వెళ్లిపోయారు. అప్పటినుంచి ఈ పోస్టు పూర్తిస్థాయి అధికారితో భర్తీ కాలేదు. ఫలితంగా దిగువస్థాయి సిబ్బందిపై అదనపు భారం పడింది. దీనిపై 'క్రైం ఎస్‌ఐ కావలెను' శీర్షికన ఈ నెల 24వ తేదీన 'సాక్షి' దినపత్రికలో వార్త ప్రచురితం కావడం తెలిసిందే. అయితే, సత్యారావుకు ఇంకా ఏడాది మాత్రమే సర్వీస్ ఉంది. వాస్తవానికి ఇక్కడ రెగ్యులర్ డైరెక్ట్ ఎస్‌ఐను నియమిస్తారు. కానీ దఫదఫాలుగా ఎస్‌ఐ పోస్టుకు పదోన్నతి పొందిన వ్యక్తినీ, అదీ ఏడాది వ్యవధిలోనే పదవీ విరమణ చేయనున్న అధికారినీ నియమించడం విమర్శలకు తావిస్తోంది. కాగా, ఎస్‌ఐ సత్యారావుకు స్టేషన్ ఏఎస్‌ఐ జి.రామకృష్ణ, రైటర్ వరలక్ష్మి, ఉమేష్, దిలీప్, జగదీష్, ఇతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం


ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఆలయ ఈవో జి.వి.రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో విశేషపూజలు నిర్వహించారు. సాయంత్రం కూడా అమ్మవారికి భక్తులు స్వయంగా జలాభిషేకం చేశారు. అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

9, 12 తేదీల్లో జీవీఎంసీ దుకాణాలకు వేలం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-3,4లో వచ్చే నెల 9, 12 తేదీల్లో పలు దుకాణ సముదాయాలు, కల్యాణ మండపం, మార్కెట్లకు బహిరంగ వేలం వేయనున్నట్టు ఆయా జోనల్ కమిషనర్లు కె. శివప్రసాద్, మల్లయ్యనాయుడు ప్రకటనలో పేర్కొన్నారు. జోన్-3 పరిధిలో గల వివిధ వాణిజ్య సముదాయాల్లో ఖాళీగా ఉన్న దుకాణాలు మూడేళ్ల కాల పరిమితికి కాంట్రాక్ట్‌కు ఇచ్చేందుకు వచ్చే నెల 12న ఆశీల్‌మెట్ట, జోన్-3 కార్యాలయంలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ శివప్రసాద్ తెలిపారు.

జోన్-4 పరిధిలో గల డైక్స్ ట్యాంక్ వాణిజ్య సముదాయం గ్రౌండ్‌ఫ్లోర్‌లో 9, 10, 11, 12, 13 (జనరల్), 15 (ఎస్సీ)కి మొదటి అంతస్తులో దుకాణం నంబరు 2 (ఎస్సీ), 3, 4, 5, 6, 7, 9, 10, 11, 12, 13, 14, 15 (జనరల్)కు అలాగే జగదాంబ జీవీఎంసీ వాణిజ్య సముదాయంలో దుకాణం నంబర్లు 3, 5, 13, 14 (ఎస్టీ)కి, పాతబస్టాండ్ ఫేస్-2లో 1,2,3,4,5,6,7, 8,10,11,13,14 (ఎస్సీ)కి, దుకాణం నంబరు 9 (ఎస్టీ)కి కేటాయించబడినవని, 39వ వార్డు పద్మానగర్ వాణిజ్య సముదాయంలో గల దుకాణాలు 1, 4, 6, 7, 11, 12 (జనరల్), 8 (ఎస్సీ)కి, 31వ వార్డు సూర్యాబాగ్ వాణిజ్య సముదాయం (జోన్-4 కార్యాలయ సమీపాన)లో ఫస్ట్‌ఫ్లోర్‌లో దుకాణం నంబరు 9, 37వ వార్డు రెల్లివీధి అంబేడ్కర్ కల్యాణ మండపం, రామకృష్ణా రైతు మార్కెట్, రెల్లివీధి రోడ్డు సైడ్ మార్కెట్లు కాంట్రాక్ట్‌కు ఇచ్చేందుకు వచ్చే నెల 9న సూర్యాబాగ్‌లో గల జోనల్ కార్యాలయంలో ఆ రోజు ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జెడ్సీ తెలిపారు.

టెన్నిస్ టోర్నమెంట్‌కు ఏఎంసీ వైద్య విద్యార్థినులు


విద్యార్థినులను అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కళాశాల వైద్య విద్యార్థినులు సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టెన్నిస్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. 2022 బ్యాచ్‌కు చెందిన ఆర్.హేమ హర్షిణి, 2024 బాచ్‌కు చెందిన ఆర్.దీపిక కీర్తి డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీ తరఫున సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టెన్నిస్ (మహిళలు) టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఎంపిక అయ్యారు. ఈ టోర్నమెంట్ 2024 డిసెంబరు 7 నుంచి 10 వరకు మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌లో జరగనుంది. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు, స్పోర్ట్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.సునీల్ కుమార్ హేమ హర్షిణి, దీపిక కీర్తిని అభినందించారు. ఇది మెడికల్ విద్యార్థులకు గొప్ప గౌరవమని ప్రిన్సిపాల్ వ్యాఖ్యానించారు. ఏఎంసీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎస్.ఎన్.పాత్రుడు పాల్గొన్నారు.